# గురుకులం..సమస్యలకు నిలయం


అసంపూర్తిగా ఉన్న ఎంజేపీ గురుకుల పాఠశాల భవనం


ఎంజేపీ గురుకుల పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే కాలవ, మంత్రి సవిత (ఫైల్)


గురుకుల పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినులు (ఫైల్)

- శాశ్వత భవనం లేక విద్యార్థినుల అవస్థలు
- అతిథి భవనంలో తరగతుల నిర్వహణ
- పట్టించుకోని కూటమి పాలకులు

**గుమ్మఘట్ట:** మండలంలోని గోనబావి గ్రామ సమీపంలో నిర్మించిన మహాత్మా జ్యోతిరావ్ పూలే గురుకుల పాఠశాలలో సమస్యలు గూడుకట్టుకున్నాయి. 2016– 2017లో పాఠశాల భవన నిర్మాణ పనులు రూ.24 కోట్లతో ప్రారంభించారు. రూ.11.73 కోట్లు ఖర్చు చేశారు. అయితే నిధులు నాడు దారి మళ్లించడంతో పనులు పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనాన్ని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు గత ఏడాది సెప్టెంబర్ నెలలో సందర్శించారు. అప్పట్లో త్వరితగతిన పనులు ప్రారంభిస్తామని చెప్పి, నేటికీ పట్టించుకోలేదు. ఈ ఏడాదైనా భవనం పనులు పూర్తయ్యేనా? అని విద్యార్థినులు ఎదురుచూస్తున్నారు.

మండల కేంద్రంలోని రేవణ సిద్దేశ్వర కంబళ్ల సొసైటీలో మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల బాలికల పాఠశాలను 9 ఏళ్లుగా అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. శాశ్వత భవనం, సరిపడా గదులు లేక విద్యార్థినులు అవస్థలు పడుతున్నారు. 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 282 మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. 32 మంది దాకా సిబ్బంది ఉన్నారు. ఉపాధ్యాయులు, తరగతి గదులకు మొత్తం 24 గదులు అవసరమవుతాయి. అతిథి భవనంలో అదనపు తరగతి గదులు లేకపోవడంతో విద్యార్థినులు, ఉపాధ్యాయులు అవస్థలు పడుతున్నారు. విద్యార్థినులకు సరిపడా బాత్‌రూంలు, మరుగుదొడ్లు లేవు.

2016–2017లో పాఠశాల పనులు రూ.24 కోట్లతో ప్రారంభించారు. అప్పట్లో నిర్మాణ పనులకు రూ.11.73 కోట్లు ఖర్చు చేసినట్లు గణాంకాలు చెప్తున్నాయి. మిగిలిన నిధులు నాడు దారి మళ్లించడంతో ఎక్కడిపనులు అక్కడే ఆగిపోయాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది.. మిగిలిన పాఠశాల పనులకు రూ.12.27 కోట్లతో పాటు ప్రభుత్వం అదనంగా రూ.10.2 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని ఎమ్మెల్యే కాలవ, మంత్రి సవిత ఆర్భాటంగా ప్రచారం చేశారు. త్వరలోనే పాఠశాల పనులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. నేటికీ ఒక్క అడుగూ ముందుకు పడలేదు.

**పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు..**

ఈ నెల 12న పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. ఈ విద్యాసంవత్సరానికైనా పాఠశాల భవనం పూర్తవుతుందని విద్యార్థినులు ఆశించారు. అద్దె భవనంలో ఉన్న పాఠశాలకు ఎప్పుడు విముక్తి లభిస్తుందోనని విద్యార్థినులు ఎదురుచూస్తున్నారు. తొమ్మిది నెలల గడిచినా పాఠశాల పనులలో ఎలాంటి ప్రగతి కనిపించకపోవడంతో మండల ప్రజలు పెదవి విరుస్తున్నారు.ప్రచార ఆర్భాటాలకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధన్యత కల్పిస్తుందే తప్ప అభివృద్ధి చేయడంలో మీనవేశాలు లెక్కిస్తోందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పాలకులు, ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో విద్యార్థులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఇప్పటికైనా పాలకులు పట్టించుకుని పాఠశాల తరగతి గదులు నిర్మించి విద్యకు ప్రాధన్యాత కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

### విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలి



పేద,బడుగు,బలహీన వర్గాలకు ఆస్తి విద్య ఒక్కటే. విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. విద్యరంగానికి ప్రభుత్వం అధిక నిధులు కేటాయించాలి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యరంగాన్ని నిర్వీర్యం చేసింది. ప్రైవేట్ పాఠశాలకు పరోక్షంగా లబ్ధి చేకూరేలా కృషి చేస్తోంది. ఎంజేపీ గురుకుల పాఠశాల బాలికల అవస్థలను పాలకులు గమనించి, వారికి శాశ్వత భవనాల నిర్మాణపు పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించాలి.

– మెట్టు గోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, రాయదుర్గం

## క్లుప్తంగా

### మందుబాబులకు అడ్డాగా పాఠశాల


తరగతి గది వద్ద వరండాలో వదిలేసిన మందుసీసా, వాటర్ ప్యాకెట్లు

**కూడేరు:** మండలంలోని ఉదిరిపికొండ ప్రాథమికోన్నత పాఠశాల మందుబాబులకు అడ్డాగా నిలిచింది. పాఠశాలకు కాంపౌండ్ వాల్ లేదు. దీంతో రాత్రివేళ మందుబాబులు పాఠశాలలోకి చేరి వరండా, ఆవరణలో కూర్చొని మందు తాగుతున్నారు. సీసాలు అక్కడే పగలగొడుతున్నారు. వాటర్ బాటిళ్ల, ప్యాకెట్లు, కురుకురే, బొరుగులు వంటి తినబండారాల కవర్లు వదిలేసి వెళ్తున్నారు. ఉదయాన్నే చిన్నపిల్లలు బడికి వచ్చినపుడు పగలగొట్టిన సీసా గాజు ముక్కలు తొక్కి ప్రమాదాలకు గురవుతున్నారు.

### విత్తన వేరుశనగ పంపిణీ


వేరుశనగ విత్తనకాయలు పంపిణీ చేస్తున్న జేడీఏ ఉమామహేశ్వరమ్మ

**ఉరవకొండ రూరల్:** జాతీయ నూనె గింజల విత్తనోత్పత్తి పథకంలో భాగంగా రాయలసీమ రైతు ఉత్పత్తిదారుల సంఘం తరపున విత్తనోత్పత్తి వేరుశనగ విత్తనాలను ములగిరిపల్లి రైతులకు జేడీఏ ఉమామహేశ్వరమ్మ ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా జేడీఏ మాట్లాడుతూ రైతులు పండించిన పంటను రాయలసీమ రైతు ఉత్పత్తిదారుల సంఘానికి అమ్మాలని, ధర మార్కెట్ ధర కంటే రూ.200 అధికంగా ఉంటుందన్నారు. రైతు విత్తనం వేసినప్పటి నుంచి పొలంలో వ్యవసాయాధికారుల పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో రాయలసీమ రైతు ఉత్పత్తిదారుల సంఘం సీఈవో శ్రీధర్ రెడ్డి, రాయలసీమ రైతు ఉత్పత్తిదారుల సంఘం బోర్డు డైరెక్టర్ నగేష్, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

### ఆర్‌ఐగా సతీష్‌కుమార్

**వజ్రకరూరు:** స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి రెవె న్యూ ఇన్‌స్పెక్టర్‌గా సి.సతీష్ కుమార్ నియమితులయ్యారు. ఇక్కడ పని చేస్తున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అశ్వర్థనారాయణ ఉరవకొండ మండలానికి బదిలీ అయ్యారు. విజయవాడలోని సీసీఎల్‌ఏలో ఏఎస్‌ఓగా విధులు నిర్వహిస్తున్న సి.సతీష్‌కుమార్ వజ్రకరూరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్‌ఐ)గా వచ్చారు.

### ఉపాధి హామీ ఏపీఓ బదిలీ

**వజ్రకరూరు:** స్థానిక జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఏపీఓ లక్ష్మీకాంతబాయి బదిలీ అయినట్లు ఎంపీడీఓ శివాజీరెడ్డి ఆదివారం తెలిపారు. ఏపీఓ లక్ష్మీకాంతబాయి బొమ్మనహాల్ మండలానికి బదిలీ అయినట్లు తెలిపారు. ఉరవకొండ మండలంలో ఏపీఓగా విధులు నిర్వహిస్తున్న విమల వజ్రకరూరు మండలానికి బదిలీ అయినట్లు ఎంపీడీఓ తెలిపారు.

### వ్యవసాయ విస్తరణ అధికారిగా భరత్‌రాజు

**వజ్రకరూరు:** స్థానిక వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ)గా భరత్‌రాజు నియమితులయ్యారు. ఉరవకొండ మండలంలో ఏఈఓగా విధులు నిర్వహిస్తున్న భరత్‌రాజు బదిలీపై వజ్రకరూరుకు వచ్చారు.

### నీలగిరిస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు


అలంకరణలో నీలగిరిస్వామి

**వజ్రకరూరు:** స్థానిక కురుబవీధి లో వెలసిన నీలగిరిస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు, ఆకుపూజ, మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం, విశేష పూజలు చేశారు. స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రా మాల భక్తులు ఆలయానికి చేరుకుని స్వామిని దర్శించుకొని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

### ఒరిగిపోయిన విద్యుత్ స్తంభాలు


గడేహోతూరు వద్ద ఒరిగిపోయిన విద్యుత్ స్తంభం

**వజ్రకరూరు:** మండలంలోని గడేహోతూరు సమీపంలో విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయి, ప్రమాదకరంగా ఉన్నాయి. ఉరవకొండ–గుంతకల్లు ప్రధాన రహదారిలో ఇరువైపులా విద్యుత్‌స్తంభాలు ఒరిగిపోయాయి. ఈదురు గాలులు, వర్షాలకు విద్యుత్ స్తంభాలు ఒరిగి కిందకు పడే అవకాశం ఉందని ప్రజలు అంటున్నారు.

### ఘనంగా సత్యసాయిబాబా పాదుకోత్సవం


కొనకొండ్లలో సత్యసాయిబాబా పాదుకోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

**వజ్రకరూరు:** మండలంలోని కొనకొండ్ల గ్రామంలో ఆదివారం సాయంత్రం గుంతకల్లు సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సత్యసాయిబాబా పాదుకోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీ సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలో పూజించిన స్వామి పాదుకలను ఆదివారం సాయంత్రం కొనకొండ్లకు తీసుకువచ్చి గ్రామ వీధుల గుండా ఊరేగించారు. అనంతరం ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహి ం చారు. కార్యక్రమంలో శ్రీసత్యసాయిసేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు రామచంద్రమూర్తి, జిల్లా స్పిరిచువల్ కోఆర్డినేటర్ నాగశయన, గుంతకల్లు సేవా సమితి అధ్యక్షుడు శంకర్ నారాయణ, సత్యసాయి కార్మికులు జయన్న, భీమేష్ పాల్గొన్నారు.

### కెంచంపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని తెరిపించండి

**కుందుర్పి:** మండలంలోని కెంచంపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తెరిపించాలని ఎంపీపీ కమలా నాగరాజు, మాజీ వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ పాలాక్షి అధికారులను ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. గత ఫిబ్రవరి నెలలో అంగన్‌వాడీ కేంద్రాన్ని స్థానిక టీడీపీ నాయకులు మూసివేయించారు.

# ‘యువత పోరు’ విజయవంతం చేద్దాం


యువత పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే మెట్టు , చిత్రంలో పార్టీ నాయకులు

**రాయదుర్గం:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 23న ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద తలపెట్టిన ‘యువత పోరు’ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ రాయదుర్గం సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని తన నివాసం వద్ద విద్యార్థి విభాగం నియోజకవర్గం అధ్యక్షుడు కేడిం ప్రశాంత్, చేనేత, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శులు పొరాళ్ల శివకుమార్, బీటీపీ గోవిందు, పట్టణ, గుమ్మఘట్ట, బొమ్మనహాళ్, డి హీరేహాళ్, రాయదుర్గం, కణేకల్లు మండల కన్వీనర్లు మేకల శ్రీనివాసులు, గౌని లక్ష్మీ కాంతారెడ్డి, రామాంజనేయులు, రవీంద్రనాథ్‌రెడ్డి, జీ రామాంజనేయులు, బ్రహ్మానందరెడ్డితో పాటు పార్టీ సినీయర్ నాయకులు, కార్యకర్తలు, యువతతో కలసి పోస్టర్లను ఆవిష్కరించారు.

**నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారో..?**

అనంతరం నిర్వహించిన సమావేశంలో మెట్టు గోవిందరెడ్డి మాట్లాడారు. లక్షలాది మంది విద్యార్థులు, యువతను ముఖ్యమంత్రి చంద్రబాబు నిలువునా మోసగించారని ధ్వజమెత్తారు. 20 లక్షల మందికి ఉద్యోగాలు ఇస్తామన్నారు..ఎప్పుడిస్తారో యువతకు సమాధానం చెప్పాలన్నారు. ప్రతి నిరుద్యోగికీ రూ.3 వేలు భృతి ప్రకటించి, ఏడాది పాలన పూర్తయినా పట్టించుకోలేదన్నారు. బాబు ష్యూరిటీ .. భవిష్యత్తుకు గ్యారెంటీ అన్నారు.. ఉన్న ఉద్యోగాలు పీకేసి రోడ్డుపాలు చేశారన్నారు. ‘ నీకు రూ.15 వేలు .. నీకు రూ.15 వేలు’ అంటూ ఊరూరా ప్రచారం చేశారని, తీరా సగం మంది తల్లుల ఖాతాల్లో డబ్బు జమ కాలేదన్నారు. అనేక ఆంక్షలతో ఇబ్బందిపెట్టడం ఏమిటని నిలదీశారు. వైఎస్సార్ సీపీ హయాంలో ‘అమ్మఒడి’ తరహాలో పథకం అమలు చేసి, నగదు జమ చేయాలని కోరారు. లేదంటే ఊరూరా ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. రైతులను కూడా అడుగడుగునా కూటమి ప్రభుత్వం దగాకు గురిచేస్తోందన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయలేదని ధ్వజమెత్తారు. సూపర్ సిక్స్ హామీలన్నీ అటకెక్కించారు. ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్ పెట్టడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఫీజులు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏడాదికే కూటమి పాలనపై ప్రజలు విసుగుచెందిపోయారన్నారు. ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించి పరిహారం ఇప్పిస్తామంటూ విప్ కాలవ శ్రీనివాసులు హామీ ఇచ్చి, రెండు నెలలు గడుస్తున్నా నేటికీ జమకాలేదని మెట్టు గోవిందరెడ్డి విమర్శించారు. సత్వరం రైతు ఖాతాల్లో జమచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కణేకల్లు మాజీ జెడ్పీటీసీ నాగిరెడ్డి, జిలా ఉపాధ్యక్షుడు మారెన్న, నాయకుడు చంద్రశేఖరరెడ్డి, శివారెడ్డి, రామాంజనేయులు, పద్మనాభరెడ్డి, కౌన్సిలర్ పొరాళ్ల గోవిందరాజులు, కోఆప్షన్ శ్రీనివాసులు, ఎర్రగుంట సర్పంచ్, బొమ్మనహాళ్, కణేకల్లు, డి హీరేహాళ్, గుమ్మఘట్ట, రాయదుర్గం మండలాల్లోని పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సాకే పురుషోత్తం

**‘యువత పోరు’ ను విజయవంతం చేయాలి**

**ఉరవకొండ:** ఈ నెల 23న కలెక్టరేట్ ఎదుట నిర్వహిస్తున్న యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ విద్యార్థి విభాగం ఉరవకొండ నియోజకవర్గ అధ్యక్షుడు సాకే పురుషోత్తం పిలుపునిచ్చారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసేదాకా పోరాటం చేస్తామని తెలిపారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలలో భాగంగా 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే 1.25 లక్షల ఉద్యోగాలు ఇచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా నాయకులు మంజునాథ రెడ్డి, ఉరవకొండ మండల నాయకులు షేక్ ఇర్ఫాన్, హరికృష్ణ, బాబా షరీఫ్, ఇంద్రకర్, తదితరులు పాల్గొన్నారు.

### యువత పోరు విజయవంతం చేద్దాం


తలారి రంగయ్య, సమన్వయకర్త

**కళ్యాణదుర్గం రూరల్:** ఈనెల 23న వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ కళ్యాణదుర్గం సమన్వయ కర్త తలారి రంగయ్య పిలుపునిచ్చారు. ఈమేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. కూటమి నేతలు సార్వత్రిక ఎన్నికల్లో నిరుద్యోగులు, విద్యార్థులకు అనేక హామీలిచ్చి, అధికారం చేపట్టిన తర్వాత వెన్నుపోటు పొడిచారన్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయలని కోరారు. పార్టీ యువజన, యూత్ఆధ్వర్యంలో 23న జిల్లా కేంద్రంలోని కలక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యువత పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

# మెకానిక్‌ల సంక్షేమానికి కృషి


నవ్యాంధ్ర టూవీలర్స్ మెకానిక్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు

**కణేకల్లు:** మెకానిక్‌ల సంక్షేమంతో పాటు సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని కణేకల్లు మండలం నవ్యాంధ్ర టూవీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడు యాల్పి శర్మాస్ తెలిపారు. ఆదివారం స్థానిక బిస్మిల్లా ఫంక్షన్ హాల్‌లో కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల టూవీలర్స్ మెకానిక్‌ల సమావేశం నిర్వహించారు. తొలుత రెండు మండలాల మెకానిక్‌లు రాంనగర్ నుంచి బిస్మిల్లా ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ చేశారు. అనంతరం నవ్యాంధ్ర టూ వీలర్స్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర వ్యవస్థాపకులు సుభాని, అధ్యక్షుడు ఉల్లి సాంబశివరావు, రాష్ట్ర సభ్యులు రహిమాన్, అశోక్, అనంతపురం జిల్లా అధ్యక్షులు జాఫర్, ప్రభాకర్, సలహాదారు మురళీరెడ్డి, గుంటూరు జిల్లా అధ్యక్షులు భవాని శంకర్ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు.

**నూతన కమిటీ ఏకగ్రీవం..**

అనంతరం కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాలకు సంబంధించిన మెకానిక్‌ల నూతన కార్యవర్గ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కణేకల్లు గౌరవ అధ్యక్షుడు అబ్దుల్ రౌఫ్, అధ్యక్షుడు యాల్పి శర్మాస్, ఉపాధ్యక్షుడు హనీఫ్, కార్యదర్శి మహబూబ్‌బాషా, సహాయ కార్యదర్శి దాదాపీర్, సాదిక్, తిమ్మరాజు, మండల ఇన్‌చార్జ్ గౌస్, జిలాన్‌బాషా, ఐదు మండలాల ఇన్‌చార్జులు అబ్దుల్ రఫూఫ్, ఫారుఖ్, కోశాధికారి, జిలాన్, ఇమామ్, గ్రీన్ ఇండియా అధ్యక్షుడు నాగేంద్ర, సభ్యులు మహబూబ్ బాషా, ఖారుక్, సురేష్, రాజేష్, బొమ్మనహాళ్ మండలం అధ్యక్షుడు సాదిక్ బాషా, ఉపాధ్యక్షుడు రవి, కార్యదర్శి ఆసిఫ్, కోశాధికారి మహమ్మద్ రఫీ, సభ్యులు హుసైన్‌సాబ్, ఖలీల్, గోవిందరాజులు, మహబూబ్‌బాషా తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# మొక్కజొన్న సాగుపై మొగ్గు


ముద్దలాపురంలో సాగు చేసిన మొక్కజొన్న పంట

**కూడేరు:** మండలంలో మొక్కజొన్న పంట సాగుపై రైతులు మొగ్గుచూపుతున్నారు. ముద్దలాపురం, కూడేరు, ఇప్పేరు, జల్లిపల్లి, అరవకూరు, గొటుకూరు, రామచంద్రాపురం, అంతరగంగ, పి.నాగిరెడ్డి పల్లి, కలగళ్ల, మరుట్ల, ఉదిరిపికొండ, కొర్రకోడు, శివరాంపేట, చోళసముద్రంతో పాటు మరికొన్ని గ్రామాల్లో సుమారు 800 ఎకరాల్లో సాగు చేశారు. రూ.వేలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన బ్యాడిగి మిర్చి, వేరుశనగ, అరటి, ఇతర పంటలు ఆశించిన స్థాయిలో దిగుబడి రాక సరైన గిట్టుబాటు ధర లేక రైతులు నష్టపోయారు. ఎకరా విస్తీర్ణంలో మొక్కజొన్న సాగు చేయడానికి విత్తనాలు, డ్రిప్‌తో కలిపి రూ.20 వేలు వరకు పెట్టుబడి అవుతోంది. దిగుబడి బాగుంటే ఎకరాకు 35 నుంచి 40 క్వింటాళ్లు వస్తుంది. మార్కెట్లో క్వింటా రూ.2వేల నుంచి రూ. 2,300 వరకు ధర పలుకుతోంది. పంట కాలపరిమితి నాలుగు నెలలు. కలుపు మొక్కలు, తెగుళ్ల బెడద తక్కువ. దీంతో ఆదాయం బాగుండడంతో మొక్కజొన్న సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ముద్దలాపురంలో బ్యాడిగి మిర్చి సుమారు 1,500 ఎకరాలకు పైగానే సాగు చేసేవారు. తెగుళ్లతో పంట దెబ్బతిని, రేటు లేకపోవడంతో రైతులు నష్టపోయారు. దీంతో మొక్కజొన్న పంటను సుమారు 250 ఎకరాల్లో సాగు చేశారు.

## పల్లెల్లో అపరిశుభ్రత


వేపులపర్తి ఎస్సీ కాలనీలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

**బ్రహ్మసముద్రం :** మండల పరిధిలోని పలు గ్రామాల్లో అపరిశుభ్ర తాండవిస్తోంది. మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు కేవలం ప్రచార ఆర్భాటంగా నిర్వహించి, చేతులు దులుపుకుంటున్నారు. దీంతో పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. మండలంలోని వేపులపర్తి, నాగిరెడ్డిపల్లి, ముప్పలకుంట, సంతే కొండాపురం తదితర గ్రామాల్లో అపరిశుభ్రత నెలకొంది. వేపులపర్తి గ్రామంలో యూనియన్ బ్యాంక్ సమీపంలో రోడ్డు పైనే వర్షపు నీరు నిలిచింది. ఎస్సీ కాలనీలో రోడ్డుపైనే నీరు నిలిచి, మురుగు గుంటలను తలపిస్తోంది. గుమ్మఘట్ట రోడ్డులో వాటర్ ట్యాంక్ వద్ద ఉన్న నీటి తొట్టె వద్ద అపరిశుభ్రత నెలకొంది. చుట్టూ చెత్తాచెదారం పేరుకుపోయింది. దీంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. అపరిశుభ్రతతో దోమల బెడద ఎక్కువైందని, అనారోగ్యం బారిన పడుతున్నట్లు ప్రజలు అంటున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకొని దోమల మందు పిచికారీ చేయించాలని కోరుతున్నారు.

### వాహనాల తనిఖీ

**వజ్రకరూరు:** మండల కేంద్రంలో శనివారం సాయంత్రం ఎస్ఐ నాగస్వామి ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. వజ్రకరూరులోని ఉరవకొండ–గుంతకల్లు ప్రధాన రహదారిపై వాహనాలు తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని, అతివేగంగా వాహనాలు నడపరాదని హెచ్చరించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరిం చాలన్నారు.

### ఆస్తి విషయంలో మహిళలపై దాడి

**వజ్రకరూరు:** మండలంలోని వెంకటాంపల్లి చిన్న తండాలో ఆస్తి విషయంలో మహిళలపై దాడి జరిగిన ఘటన ఆదివారం జరిగింది. ఎస్ఐ నాగస్వామి తెలిపిన మేరకు.. ఉదయం గ్రామానికి చెందిన సక్రమ్మ తన కూతురు సరస్వతి ఇంటికి వచ్చి తిరిగి వెళ్తుండగా, అదే గ్రామానికి చెందిన ఎర్రిస్వామి, అతని భార్య అరుణబాయి దాడి చేశారు. విషయం తెలియగానే సక్రమ్మ కూతురు సరస్వతి అక్కడకు వెళ్లగా ఆమెపైనా దాడి చేశారు. దాడిలో గాయపడిన సక్రమ్మ, సరస్వతిని ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సక్రమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### యోగాంధ్ర పేరుతో విద్యార్థులకు అగచాట్లు

**బొమ్మనహాళ్:** యోగాంధ్ర పేరుతో విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని పీడీఎస్‌యూ (ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం) అనంతపురం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విశాఖలోని యోగాంధ్ర కార్యాక్రమానికి సుమారు 25 వేల మంది గిరిజన విద్యార్థులను తీసుకెళ్లి, వస్తులతో పంపించారన్నారు. రూ.కోట్లలో నిధులు వెచ్చించినా కనీస సౌకర్యాలు కల్పించకపోవడం దారుణమన్నారు. మరుగుదొడ్లు, వసతి, తాగునీరు, భోజనం తదితర వసతులు కల్పించలేదన్నారు. గిన్నిస్ బుక్ రికార్డు కోసం గిరిజన విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడతారా? అని ధ్వజమెత్తారు.

## సీపీఎం ఆధ్వర్యంలో గ్రామీణ శ్రామికుల సర్వే

**వజ్రకరూరు:** మండలంలోని వివిధ గ్రామాల్లో సీపీఎం ఆధ్వర్యంలో గ్రామీణ శ్రామికుల స్థితిగతులపై ఆదివారం సర్వే నిర్వహించారు. కమలపాడు, కొనకొండ్ల తదితర గ్రామాల్లో సీపీఎం నాయకులు పర్యటించి, వ్యవ సాయేతర శ్రామికులను కలిసివారి సమస్యలు, కష్టాలను అడిగి తెలుసుకున్నారు. భూమిలేని పేదలు, చిన్న, సన్నకారు రైతులు, వ్యవ సాయ కూలీలు, ఆటో హమాలీలు, భవన నిర్మాణ కార్మికులు, చేతివృత్తిదారులను కలిసి వివరాలను సేకరించారు. నాయకులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చిన్న,సన్నకారు రైతులు వ్యవసాయ కూలీలుగా చేస్తూ వ్యవసాయేతర పనులైన ఆటో హమాలీలు, భవన నిర్మాణ కార్మికులుగా, చేతివృత్తి దారులుగా, కూలీలుగా జీవనం సాగిస్తున్నారన్నా రు. సర్వే అంశాలతో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించనున్నట్లు తెలిపారు. సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యుడు శ్రీనివాసులు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు విరూపాక్షి, శ్రామిక సంఘం నాయకులు సుధాకర్, రామునాయక్, సుధాకర్ పాల్గొన్నారు.



## సంబరం.. అపూర్వ సమ్మేళనం

**కణేకల్లు:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 2000–01లో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు పాఠశాలలో కలుసుకొని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు శివ చిక్కన్న, హబీబ్, హనుమంతరెడ్డి, తిరుపాలరెడ్డి, గుర్రప్ప, రాజేంద్రపసాద్‌లను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. నాటి గురువులు మాట్లాడుతూ అంతంత మాత్రమే సదుపాయాలు ఉన్న నాటి రోజుల్లో చదువుకున్న విద్యార్థులు నేడు ఉన్నత స్థాయిలో ఉండడం తమకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. కొన్నేళ్ల తర్వాత తమను గుర్తు పెట్టుకొని సత్కరించడం గర్వంగా ఉందన్నారు. తాము చదువుకున్న పాఠశాలకు తమవంతుగా అభివృద్ధి చేయాలని పూర్వ విద్యార్థులు తీర్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు విక్రమ్, అనిల్, నాగు, సునీల్, గౌస్, రవిశంకర్, త్రిలోక్, సతీష్, శివప్రకాష్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.